వికారాబాద్, ఫిబ్రవరి 4 : హైదరాబాద్‌లోని సోమాజీగూడ యశోద దవాఖానలో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను ఆదివారం వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిపై ఎమ్మెల్యేను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఆయనతో పాటు శ్రీశైలంరెడ్డి ఉన్నారు.

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

పరిగి : మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 4 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పరిగి మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన సాయి, శివ కుటుంబాలకు అండగా ఉంటామని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మృతుల కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి వారికి మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ అరవింద రావు, మున్సిపల్ చైర్మన్ అశోక్, బీఆర్ఎస్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఉన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

కులకచర్ల : మండల పరిధిలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన చిల్ల పుల్లమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి అనంతసాగర్‌కు చేరుకొని మృతురాలి కుటుంబసభ్యులను పరామర్శించారు. అంత్యక్రియలకు రూ.5వేల ఆర్థిక సహాయం అందించారు. పేదలకు తాను ఎల్లప్పుడు అండగా ఉంటానని తెలిపారు. పరిగి నియోజకవర్గలోని ప్రజలకు అందుబాటులో ఉండి తనవంతుగా సహాయం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ కులకచర్ల మండల నాయకులు పీరంపల్లి రాజు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రాములు, ఉపాధ్యక్షుడు కేశవులు, మాజీ సర్పంచ్ ఆంజనేయులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

లక్ష్మమ్మ కుటుంబ సభ్యులకు పరామర్శ

దోమ : దోమ పీఏసీఎస్ చైర్మన్ దాతన్‌గారి ప్రభాకర్‌రెడ్డి మాతృమూర్తి లక్ష్మమ్మ(70) శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆదివారం ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ మల్లేశం, పార్టీ అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, పరిగి ఎంపీపీ అరవిందరావు, దోమ సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీటీసీ బసప్ప, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, డైరెక్టర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చౌడాపూర్‌కు బస్‌సౌకర్యం కల్పించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కులకచర్ల, ఫిబ్రవరి 4 : షాద్‌నగర్ నుంచి చౌడాపూర్ మండలానికి బస్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను కోరారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా జిల్లేడ్-చౌదర్‌గూడ మండలానికి వచ్చిన ఆయనను కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో షాద్‌నగర్ డిపో నుంచి చౌడాపూర్ వయా నవాబుపేట మీదుగా మహబూబ్‌నగర్‌కు బస్ నడిపేవారని తెలిపారు. కరోనా సమయంలో బస్సులు బంద్ చేసిన తర్వాత బస్‌సౌకర్యం లేదన్నారు. బస్ సౌకర్యం కల్పించేలా చొరవ తీసుకోవాలని కోరడంతో ఎమ్మెల్యే స్పందించి ఈ నెల చివరి వరకు బస్ సౌకర్యాన్ని తిరిగి ప్రారంభించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండీ సలీమ్, వెంకటేశ్, వినయ్‌కుమార్, రాము, భరత్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా వేడుక

- భక్తిశ్రద్ధలతో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు
- కార్యక్రమానికి హాజరైన స్పీకర్ గడ్డం ప్రసాద్
- అర్చకులతో ప్రత్యేక పూజలు
- మూడు రోజుల పాటు జరుగనున్న సంబురాలు

వికారాబాద్, ఫిబ్రవరి 4 : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని అనంతగిరిపల్లిలో పండుగ వాతావరణం నెలకొంది. ఆదివారం నూతన బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమం స్థానిక కౌన్సిలర్లు దేవీరెడ్యానాయక్, జైదుపల్లి మురళి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్పీకర్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులు, ఒగ్గు కళాకారులు నృత్యాలు చేశారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలను మూడు రోజుల పాటు జరుపుకోనున్నారు. వికారాబాద్ మున్సిపల్ చైర్పర్సన్ మంజులారమేశ్ దంపతులు హాజరై పూజలు చేశారు. గ్రామంలో ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో ఊరంతా పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రమేశ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ రాములమ్మ, కాలనీ పెద్దలు అనంతయ్య, బాగయ్య, రాజునాయక్, రెడ్డి శేఖర్, నర్సింహులు కాలనీ వాసులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ చైర్పర్సన్ మంజులారమేశ్‌కుమార్

బొడ్రాయికి పూజలు చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్
- ప్రమాణ స్వీకారం చేసిన ఆర్యవైశ్య జిల్లా సంఘం కార్యవర్గం

శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్, జడ్పీ చైర్పర్సన్ సునితామహేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘం సభ్యులు

కొడంగల్, ఫిబ్రవరి 4: ఆర్యవైశ్యుల అభ్యున్నతికి ప్రభుత్వం పూర్తి కృషి చేస్తుందని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ తెలిపారు. ఆదివారం స్థానిక రాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో వికారాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, మహిళా సంఘం, యువజన సంఘం, సేవాదళ్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా సభాపతితో పాటు జెడ్పీచైర్పర్సన్ హాజరయ్యారు. వారిని ఆర్యవైశ్య సంఘం సభ్యులు ఘనంగా స్వాగతం పలికి, గజమాలతో సన్మానించారు. నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు, కార్యవర్గ సభ్యులకు వారు శుభాకాంక్షలు తెలిపారు. అంతకుముందు ఆర్యవైశ్య జిల్లా సంఘంతో పాటు అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో పాటు కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. పట్టణానికి చెందిన శివకుమార్ గుప్తా ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గుర్‌నాథ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, వికారాబాద్ మున్సిపల్ చైర్మన్ మంజుల, జడ్పీవైస్ చైర్మన్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ప్రశాంత్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలేశ్వర్‌గుప్తా, మల్లికార్జున్‌గుప్తా, గణేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కట్టమైసమ్మ జాతర ఉత్సవాలు

పల్లకీసేవలో ఆర్‌బీఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, భక్తులు

తాండూరు, ఫిబ్రవరి 4: తాండూరు పట్టణం గుమాస్తానగర్‌లోని కట్టమైసమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం వైభవంగా జరిగాయి. మహిళలు బోనాలతో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం పల్లకీసేవను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆర్‌బీఎల్ సీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, స్థానిక నేతలు, భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మహాప్రసాద కార్యక్రమం చేశారు.

పార్కులో ఆట వస్తువుల ఏర్పాటు

పార్కులోని ఆట వస్తువులను ప్రారంభిస్తున్న కౌన్సిలర్ అనంత్‌రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 4 : వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో కౌన్సిలర్ అనంత్‌రెడ్డి కార్తీకేయ నగర్‌లోని పార్కులో ఏర్పాటు చేసిన ఆట వస్తువులను ఆదివారం ప్రారంభించారు. చిన్నారులు, పెద్దలు ఆటలాడేందుకు అనువైన స్థలం ఉండడంతో ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. చిన్నారులు, పెద్దలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని కౌన్సిలర్ తెలిపారు. వారితో పాటు కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

తరిగోపులలో ఉచిత వైద్య శిబిరం

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ధారూరు, ఫిబ్రవరి 4 : మండల పరిధిలోని తరిగోపుల గ్రామంలో ఆదివారం వికారాబాద్ పట్టణంలోని ఈషా ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 320మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆస్పత్రి వైద్యులు విశ్వతేజ, భరత్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఈషా ఆస్పత్రి సిబ్బంది, నాయకులు వెంకట్ రాంరెడ్డి, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

మాజీ సర్పంచ్ మదన్‌మోహన్‌ను సన్మానిస్తున్న నాయకులు, గ్రామస్తులు

తాండూరు రూరల్, ఫిబ్రవరి 4 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని తాండూరు మండలంలోని బెల్కటూర్ తాజా, మాజీ సర్పంచ్ మధన్‌మోహన్ అన్నారు. ఆదివారం గ్రామంలోని రైతు వేదికలో సర్పంచ్ మధన్‌మోహన్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి మారు మూల గ్రామాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా నిధులు వ్యయం చేశారని గుర్తు చేశారు. అనంతరం ఎంపీటీసీల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. సర్పంచ్ చేసిన అభివృద్ధి, సేవలను కొనియాడారు. మాజీ ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో గ్రామంలో రూ.50లక్షల అభివృద్ధి పనులు చేయించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సయ్యగౌడ్, బీఆర్ఎస్ నాయకులు ఉమాశంకర్, ఎంపీటీసీ వసంత్‌కుమార్, సంగప్ప, ఉపాధ్యాయులు రాం నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు.

చెన్‌గేశ్‌పూర్‌లో..

తాండూరు మండలంలోని చెన్‌గేశ్‌పూర్ సర్పంచ్ రామమ్మను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజూ గౌడ్, ఏపీఎం శేఖర్, శ్రీశైలం, వెంకట్‌రాములు, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

ఎబ్బనూరులో..

ధారూరు : మండల పరిధిలోని ఎబ్బనూరు గ్రామంలో ఆదివారం సర్పంచ్ శ్రీకాంత్‌రెడ్డితో పాటు వార్డు సభ్యులను గ్రామస్తులు సన్మానించారు. సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేసి సన్మానించామని గ్రామస్తులు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

యాదవులు అన్ని రంగాల్లో రాణించాలి

కందుకూరులో మాట్లాడుతున్న పర్వతాల్ యాదవ్

కందుకూరు, ఫిబ్రవరి 4 : యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని మండల అధ్యక్షుడు పసుపుల పర్వతాల్ యాదవ్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీతారామ శాస్త్రి ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. యాదవులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా రాణించాలన్నారు. కార్యక్రమంలో బాలరాజు, మైసయ్య యాదవ్, నర్ల నర్సింహ యాదవ్, రామక్రిష్ణ యాదవ్, చెన్నయ్య యాదవ్, అంజయ్య యాదవ్, సుధాకర్ యాదవ్, రాజు యాదవ్, శ్రీను యాదవ్, విశ్వనాథ యాదవ్, ఆంజనేయులు యాదవ్, రాజశేఖర్ యాదవ్, భిక్షపతి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విరగబూసిన మామిడిపూత

కులకచర్ల, ఫిబ్రవరి 4 : శీతాకాలం వస్తే మనకు గుర్తుకొచ్చేది మామిడిపూత. వేసవికి ముందుగానే మామిడి చెట్లు పూతపడతాయి. ప్రస్తుతం మామిడి చెట్లకు పూతలు పడుతున్నాయి. గతేడాది మామిడిపూత పట్టిన తర్వాత ఆశపడిన రైతన్నలకు పూత రాలిపోవడంతో మామిడి తోటల రైతన్న కష్టాలు పడ్డాడు. ఈ సారైనా మామిడిపూత పట్టి రాలకుండా ఉండాలని కోరుకుంటున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

విజేతలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఇందిరమ్మ దశరథ ముదిరాజ్

కందుకూరు. ఫిబ్రవరి 4 : క్రీడలతో మానసిక ఉల్లాసంతో పాటు స్నేహానికి నాంది పలుకుతాయని మాజీ సర్పంచ్ కాకి ఇందిరమ్మ తెలిపారు. అన్నోజిగూడ గ్రామంలో యువకులు నిర్వహించిన ప్రిమియర్ లీగ్ సీజన్ 5 క్రికెట్ పోటీలను నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆదివారం బహుమతులను అందజేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కాకి దశరథ ముదిరాజ్‌తో కలిసి మాట్లాడుతూ.. చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని కోరారు. ఆటల పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉండగా క్రీడలకు పెద్దపీట వేసినట్లు పేర్కొన్నారు. ఆర్‌సీబీ జట్టు విజయం సాధించగా.. ఎంఐ టీమ్‌కు రెండో బహుమతి కింద ట్రోఫీ.. నగదును ఢిల్లీ కృష్ణ అందజేశారు. అనంతరం క్రీడాకారులు, యువకులు కలిసి గ్రామ సర్పంచ్‌గా సేవలందించిన ఆమెను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల యువజన విభాగం కార్యదర్శి గొర్రెంకల రామకృష్ణ ముదిరాజ్, దాతలు సధాకర్, రఘురాం రాథోడ్, అర్గనైజర్లు ఢిల్లీ శివకుమార్, శ్రీకాంత్, శివకృష్ణ, భాను, క్రీడాకారులు యువకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై దృష్టి సారించాలి

ప్రజలకు మందులను పంపిణీ చేస్తున్న విశ్వేశ్వర్‌రెడ్డి

కందుకూరు. ఫిబ్రవరి 4 : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని చేవేళ్ల మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. దెబ్బడగూడ గ్రామంలో స్వర్గీయ కొండ మాధవరెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన పాల్గొని ఉచిత మందులను పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను నిర్వహించడం పేదలకు ఆరోగ్య సేవలందించినట్లు అవుతుందని పేర్కొన్నారు. పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. పేదలకు వైద్య సేవలందించేందుకు కృషి చేయాలని స్వచ్ఛంద సంస్థలను కోరారు. ప్రభుత్వం ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. గ్రామాల్లో పేదలకు వైద్యం అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. సందర్భంగా దెబ్బడగూడతో పాటు పరిసర గ్రామాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి పాండు, నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎల్మటి దేవేందర్‌రెడ్డి, కొంతం జంగారెడ్డి, ఎంపీటీసీ ఎల్మటి లక్ష్మి, బీజేవైఎం నాయకులు కల్లెం సుదాకర్ రెడ్డి, సురుసాని భూమిరెడ్డి, ఎల్మటి అశోక్ రెడ్డి, చెన్నారెడ్డి. కళ్యాణ్, మల్లారెడ్డి, బండ రామాంజి, బాబూరావు, శ్రీశైలం, సందీప్ రెడ్డి, డాక్టరు అనుద్రుతి, సంతోష్, వైద్య సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం చేయడంలో ఎంతో ఆనందం

గాంధీ ఆస్పత్రి వద్ద నిర్వహించిన కార్యక్రమంలో అన్నం వడ్డిస్తున్న పెద్ది శంకర్

ఆర్కేపురం, ఫిబ్రవరి 4 : పేదల ఆకలి తీర్చేందుకు రెడీటూ సర్వ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం నిర్వహించే అన్నదాన కార్యక్రమంలో భాగంగా ఆదివారం గాంధీ జనరల్ ఆస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడీ టూ సర్వ్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ పెద్ది శంకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రుల వద్ద రోగులకు సహాయకులుగా వచ్చే వారికి అన్నదానం చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గాంధీ మర్యాల, విజయభాస్కర్, ప్రకాశ్ యాదవ్, శివ, చైతన్య, శివ, నాయుడు, నితిన్, విష్ణువర్ధన్, నరేంద్రవర్మ తదితరులు ఉన్నారు.

పుట్టినరోజు వేడుకలకు దూరంగా మాజీ ఎమ్మెల్యే

పరిగి, ఫిబ్రవరి 4 : పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ఈనెల 5న తన పుట్టిన రోజు వేడుకలను నిర్వహించరాదని నిర్ణయించారని నార్మాక్స్ మాజీ డైరెక్టర్ బి.ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మహేశ్‌రెడ్డి తండ్రి, అసెంబ్లీ మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి మరణించి ఏడాది పూర్తి కాలేదన్నారు. ఈ సందర్భంగా సోమవారం మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించరాదని నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఈ విషయాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గమనించాలని సూచించారు.

టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థిని ప్రతిభ

నితిక

వికారాబాద్, ఫిబ్రవరి 4 : పదో తరగతి విద్యార్థులకు ఇటీవల జిల్లా స్థాయిలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్ట్‌లో మోమినపేట మండలం మేకవనంపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని ఐ.నితిక ఇంగ్లిష్ మీడియం కేటగిరిలో జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా ఆ పాఠశాల హెచ్ఎం గౌరీశంకర్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు అరుణ్‌కుమార్ విద్యార్థినిని అభినందించారు. రాష్ట్ర స్థాయి ప్రతిభా పరీక్షలో కూడా మొదటి స్థానం రావాలని ఆకాక్షించారు.

నేడు ఉపాధిహామీపై ప్రజావేదిక

పూడూరు, ఫిబ్రవరి 4 : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా జరిగిన పనులపై సోమవారం ఉదయం 10 గంటలకు మండల కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఎంపీడీవో ఉమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. 2022-23 సంవత్సరానికి సంబంధించి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో జరిగిన పనులపై అధికారులు తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. ఈ వేదికలో జిల్లా, మండల స్థాయి ఉన్నతాధికారులు పాల్గొంటారని చెప్పారు. సమావేశానికి గ్రామ పంచాయతీ ప్రత్యేకాధికారులు, ఉపాధిహామీ పనులు చేయించే మేటీలు సకాలంలో హాజరు కావాలని కోరారు.

6న బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం

మంచాల, ఫిబ్రవరి 4: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరరిధిలోని మన్నెగూడ వేద కన్వెన్షన్‌హాల్‌లో ఈనెల 6న నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్ తెలిపారు. ఈ సమావేశానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని తెలిపారు. మండలంలోని కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కులకచర్ల, ఫిబ్రవరి 4 : మండల పరిధిలోని అంతారం సమీపంలో ఇసుకను అక్రమంగా తీసుకెళ్తున్న గ్రామానికి చెందిన కావలి శ్రీనివాస్‌కు సంబంధించిన ఇసుక ట్రాక్టర్‌ను తమ సిబ్బంది గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి సీజ్ చేశామని ఎస్సై శ్రీశైలం తెలిపారు. ఇసుక ట్రాక్టర్‌కు సంబంధించి ఎలాంటి అనుమతి పత్రాలు లేకపో వడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.
NT-319429-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్రియలతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్నీ గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు, వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు మరియు ఇతర ప్రకటనల కొరకు ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి : 91827 77665
తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962